క్లుప్తంగా

దసరా కానుకల అందజేత



కార్యకర్తలు, నాయకులకు వాసుపల్లి చేతుల మీదుగా కానుకలు అందజేస్తున్న పీతల వాసు

దాబాగార్డెన్స్: దసరా పండగను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధి 29వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల వాసు పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా ఆదివారం కానుకలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకల ఈశ్వర్, బెవర మహేష్, ఆరుగుల రాజ్‌కుమార్, తమ్మినేని శ్రీను, బొండాడ వెంకట రమణ, పడాల సూర్యకుమార్, కొండ్రి సతీష్, సారిపల్లి రమణ ఈశ్వరరావు, గొరుసు అప్పలరెడ్డి, చలమరెడ్డి మహేష్, కొయ్యి చిన్ని, అడపా శివ, సంతోష్, పైబోడి శివ, గొలగాని మధు, తక్షిత్, వినోద్, మహేశ్వరి, మేడిశెట్టి రూప, నీలాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్-5లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 2న ప్రారంభమైన క్యాంపెయిన్‌లో భాగంగా డీఆర్‌ఎం లలిత్ బోహ్రా నేతృత్వంలో పలువురు ఉన్నతాధికారుల బృందం రైల్వే బోర్డు నిర్దేశించిన సూచనలతో ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్పారు. వాల్తేర్ డివిజన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పెండింగ్ రిఫరెన్సెస్, పాత ఫైళ్లు పరిశీలించి సాధ్యమైనంత త్వరగా వీటిని పరిష్కరిస్తారని చెప్పారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్క్రాప్ మెటీరియల్ డిస్పోజల్ వంటి పనులు చేపట్టనున్నారని, ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వాల్తేర్ డివిజన్ స్వచ్ఛతలో మరో నూతన అడుగు వేయనున్నట్లు తెలిపారు.

తాగునీరు వృథా



మహారాణి పార్లర్ కూడలి వద్ద వాల్వ్ లీకై వృథాగా పోతున్న నీరు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని మహారాణి పార్లర్ కూడలి వద్ద కుళాయిలకు నీరు పంపిణీ చేసే కంట్రోలింగ్ వాల్వ్ లీకవుతోంది. దీంతో రోడ్డుపై నుంచి తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ అన్నసమారాధన



ఈశ్వరినగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతం ఈశ్వరినగర్‌లో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. ఎర్నిదుర్గా, మహాకాళి, భైరవ శక్తి పీఠం గురుస్వామి అభిరాం అఘోరా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాంసాహారంతో కూడిన అన్నదానం చేశారు. పెదగదిలి, చినగదిలి, ఈశ్వరినగర్, సాలిపేట తదితర కొండవాలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వదలని ప్లాస్టిక్ భూతం



- నియోజకవర్గంలో విచ్చలవిడిగా విక్రయాలు
- నియంత్రణ చర్యలు శూన్యం
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం నార, గుడ్డ సంచులు

అల్లిపురం: ప్లాస్టిక్ భూతం వీడటం లేదు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖాధికారుల బాధ్యతారాహిత్యంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అల్లిపురం, కురుపాం మార్కెట్, పూర్ణామార్కెట్, రామకృష్ణాబజార్‌తో పాటు దక్షిణలోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది.

తూతూమంత్రంగా దాడులు..

నగరంలో అల్లిపురంతో పాటు పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గొడౌన్లు ఉన్నాయి. వీటి ద్వారా నిషేధిత ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారం రూ.కోట్లల్లో జరుగుతోంది. ప్రభుత్వం, అధికారుల అండతోనే ఇది జరుగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చెత్త నిర్వహణలోనూ విఫలం..

వార్డుల్లో ప్లాస్టిక్ నిషేధంపై నామ్‌కే వాస్తే అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నా వాటి వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడంలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యాపారులు నిర్భయంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లు, కొన్ని స్టార్ హోటళ్లలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం జోరుగా సాగుతోంది. వీటిలో వేడి పదార్థాలు వేస్తే ప్లాస్టిక్ కరిగి అందులోని రసాయనాలు క్యాన్సర్ కారకాలుగా మారుతాయని వైద్యులు చెబుతున్నారు.



యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం

కఠిన చర్యలు తీసుకోవాలి..

ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి. దొరికితే సీజ్ చేయాలి. మొదటి సారి దొరికితే రూ. 25 వేలు జరిమానా, రెండోసారి దొరికితే రూ.50 వేలు జరి మానా విధించాలి, మూడోసారి దొరికితే ఆ షాపును సీజ్ చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటనలే తప్ప అమలు చేసిన దాఖలాలు లేవు. ఆ నిబంధనలు కఠినంగా అమలు చేసినప్పుడే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గుతుంది.

– ఎస్.నర్సింహమూర్తి, అల్లిపురం

గుడ్డ సంచులపై అవగాహన కల్పించాలి..

ప్రజలు గుడ్డ సంచులకు అలవాటు పడేలా అధికారులు నిరంతరం అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ పట్టుకుంటే ఫైన్ అనేలా నిబంధనలు కఠిన తరం చేయాలి. ప్రజలు కూడా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని, గుడ్డ, నార సంచులు వాడాలి. వ్యాపారులు ఇచ్చినా వద్దని చెప్పాలి. అప్పుడే ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుంది. ప్రజలు చేతి సంచితో బజారుకు వెళ్లి అందులోనే కావలసినవి తెచ్చుకోవాలి.

– బొడ్డేటి ప్రసాద్, అల్లిపురం

ప్రజల సహకారం అవసరం..

ప్లాస్టిక్ నిషేధానికి ప్రజల సహకారం కూడా ఉండాలి. ప్లాస్టిక్ వల్ల రకరకాల జబ్బులు వస్తున్నాయి. రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. ప్లాస్టిక్‌ను తిని పశువులు చనిపోతున్నాయి. కొన్ని రకాల మూగ జీవాలు కవర్లు ముఖాలకు చిక్కుపడి ఊపిరాడక ప్రాణాలు వదులుతున్నాయి. కాగితం కవర్లు, గుడ్డ సంచుల వినియోగం పెంచుకోవాలి. చేతి సంచి నామోషీగా కాకుండా బాధ్యతగా భావించాలి. అప్పుడే ప్లాస్టిక్ నిషేధం సంపూర్ణంగా అమలవుతుంది.

– యల్లపు నాగరాజు, నేరెళ్లకోనేరు

వర్షం.. హర్షం



వెంకటేశ్వరమెట్టపై వర్షం కురుస్తున్న దృశ్యం



దొండపర్తి రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

అల్లిపురం: ఆదివారం సాయంత్రం నగరంలో భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. దీంతో అల్లిపురం, దొండపర్తి ప్రాంతాలలోని రహదారుల్లో వర్షం నీరు నిలిచిపోయింది. చావులమదుం, డీఆర్‌ఎం కార్యాలయం రోడ్డు ప్రాంతాలలో నిలిచిపోయిన వర్షం నీటిలోనే వాహనాల రాకపోకలు సాగాయి. దొండపర్తిలో ప్రతి ఆదివారం సండే మార్కెట్ నిర్వహించే చిరు వ్యాపారులు పెద్దగా కనిపించలేదు. దుకాణాలు పెట్టిన ఒకరిద్దరు చిరు వ్యాపారులు జనం లేక డీలా పడ్డారు. ఇప్పటికే వాతావరణ శాఖ విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో పిడుగులు పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ (విశాఖ, హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కామెడీ షో జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్యమి, రాగస్ నాయుడు, సూర్య, ఎస్.ఎస్.నాయుడు, పోర్టు శేషు, భానుప్రకాష్‌లు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు నాటికలు అలరించాయి. శివా క్లాసికల్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ అండ్ యోగా గురువు శివా శిష్య బృందం లిఖిత, సంజన చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు సన్‌మూర్తి, మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, విశ్రాంత డీపీఆర్‌వో ఎల్.బి.వెంకటరావు చేతుల మీదుగా సత్కరించారు.

మత్స్యకార యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నూకరాజు తల్లిని పరామర్శిస్తున్న ఉమ్మడి కల్యాణ్ తదితరులు

ఎంవీపీకాలనీ: జోడుగుళ్లపాలెం మత్స్యకార ప్రాంతానికి చెందిన గరికిన నూకరాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మడి కల్యాణ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల చేపల వేటకు వెళ్లిన నూకరాజు పడవ బోల్తాపడి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం కల్యాణ్ తదితర మత్స్యకార యువకులు నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో పలువురు 18వ వార్డు మత్స్యకార యువకులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి పైనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చాతుర్మాస దీక్షలో భాగంగా సుందరకాండ హవనం, శ్రీనివాస కల్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు వెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

సీతంపేట: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పైన సెమినార్ హాల్‌లో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు హెచ్‌ఆర్‌సీ ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యత తెలియజేశారు. జాతీయ ఉపాధ్యాయుడు రామ్‌సింగ్ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజుని, ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు సునీత, శ్యామల, విన్నకోట ఫణికుమార్, ఎ.రామలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యక్షుడు సుదర్శన పట్నాయక్, మంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం



సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ప్రచారం చేసున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని 76వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. ఈ మేరకు నడుపూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రజలు అదానీ గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. సమావేశంలో తాటికొండ జగదీష్, తలారి నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, బ్రహ్మనందరెడ్డి, శీరం రమణ, దాసరి రమణ, రామారావు, బెల్లాల నాగేశ్వరరావు, శరత్ కుమార్, శీర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని, ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక ప్రజలంతా తరలివచ్చి తమ గొంతు వినిపించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాతగాజువాక జంక్షన్ నుంచి ప్రజలను చైతన్య పరిచేందుకు ఆదివారం ప్రచారం నిర్వహించారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 10 లక్షల మంది ప్రజలు తీవ్ర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎం. రాంబాబు, అయోధ్యరామయ్య, గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడికి బ్యాగ్ అందిస్తున్న హెచ్‌సీ డీకేవీ స్వామి

పెందుర్తి: జీవీఎంసీ పరిధి వేపగుంట ప్రాంతానికి చెందిన డొంతుకూరి వెంకట సత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

విద్యార్థులకు యోగా పుస్తకాల అందజేత



విద్యార్థులకు యోగా పుస్తకాలు అందజేస్తున్న తులసీరావు

జగదాంబ: యోగా అందరి జీవితంలో భాగం కావాలని, యోగా ద్వారానే పరిపూర్ణ జ్ఞానం పొందవచ్చని రిషి సంపద ఆశ్రమ నిర్వాహకులు తులసీరావు అన్నారు. వివేకానంద సంస్థలో జరుగుతున్న చిన్నారుల యోగా శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శ్రీకృష్ణ చైతన్య యోగా కేంద్రం సంపూర్ణ యోగాభ్యాసం 1,2 పుస్తకాలను బహుమతిగా అందించారు. చక్కగా యోగాసనాలు వేస్తున్నారని విద్యార్థులను అభినందించారు. విద్య, కూచిపూడి నృత్యాలు, యోగా వంటి వాటిలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ గణేష్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పరామర్శ



గాయపడిన చిన్నారులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకుడు రవికుమార్ తదితరులు

మహారాణిపేట: జాలరిపేట అన్నదాన కార్యక్రమంలో వేడి గంజి పడి గాయాలపాలైన పిళ్ల ధనుష్ (8), పిళ్ల నక్షత్ర లహరి (5)లను బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు రూపాకుల రవికుమార్ ఆదివారం కేజీహెచ్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ డాక్టర్ దుర్గాప్రసాద్‌తో రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారులిద్దరూ అన్నాచెల్లెళ్లు అని, వీరి కాళ్ల దగ్గర 20 శాతంలోపు గాయాలయ్యాయని, వాటికి ఇన్ఫెక్షన్ సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వైద్యులు తెలిపారు. నాణ్యమైన మందులు వాడుతున్నామని వివరించారు. సూపరింటిండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ దుర్గాప్రసాద్ చిన్నారుల గురించి తెలిపారు. బీజేపీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రతినిధి సీహెచ్ రాజబాబు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, టీడీపీ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

దాబాగార్డెన్స్: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1987–88 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. స్పర్శ స్వచ్ఛంద సంస్థ ద్వారా మధురవాడ ఐటీ హబ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వీరంతా కలుసుకున్నారు. సమ్మేళనంలో దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని సరదాగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ కష్ట సుఖాలు తోటి మిత్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వయసు మరిచిపోయి 50 ఏళ్లు దాటినా.. 20 ఏళ్ల కుర్రాళ్లలా గంతులేశారు. 12 ఏళ్ల కిందట ఏర్పాటు స్పర్శ సంస్థను ఏర్పాటు చేశామని, ప్రతి ఏటా అక్టోబర్‌లో మిత్రులంతా కలుసుకుంటామని వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ట శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి కర్రి సంజయ్ ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేసిన ఆర్గనైజర్లు రషీద్, దుక్క పరమేశ్వరరావు, ఖాదరవల్లీ, సునీల్, కాకి శ్రీనుతో పాటు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీను, సహాయ కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి పెంటకోట నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాలతో నిండిపోయిన రైతుబజార్ రహదారి



తోటగరువు రైతుబజార్ రహదారిపై నిలిపిన వాహనాలు

ఆరిలోవ: ఆరిలోవ తోటగరువు రైతుబజార్ రహదారి వాహనాలతో నిండిపోతోంది. వినియోగదారులు బజార్‌లోకి వెళ్లి కూరగాయలతో తిరిగి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 2న తోటగరువులో రైతుబజార్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది జనాభా ఉండటంతో రైతుబజార్‌కు రోజురోజుకూ రద్దీ పెరుగుతోంది. పెదగదిలి బ్రిడ్జి నుంచి రైతుబజార్ లోపలకు సుమారు 100 మీటర్లు దూరం ఉంటుంది. అక్కడికి చేరడానికి సన్నని రహదారి ఉంది. దానిపై కొందరు వినియోగదారులు ద్విచక్ర వాహనాలు నిలపగా.. మరికొందరు వ్యాపారులు కూరగాయల కోసం ఆటోలపై వచ్చి వాటిని కూడా అదే రోడ్డుపై నిలిపేస్తున్నారు. దీంతో ఇరువైపులా నిలుపుతున్న వాహనాలతో రోడ్డుపై నడవడానికి సైతం ఇబ్బంది పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. వాహనాలు నిలపడానికి ప్రత్యేకంగా పార్కింగ్ కోసం రైతుబజార్, విమ్స్ గోడ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి



నిందితుడితో పెందుర్తి పోలీసు సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పార్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రి గెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాల వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్ఐ ఎన్వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ భాస్కరరావు వెల్లడించారు.